క్లుప్తంగా

రేపు బుగ్గ క్షేత్రంలో శివపార్వతుల కల్యాణం

వల్లూరు(చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె మండలంలోని ప్రసిద్ధి చెందిన బుగ్గక్షేత్రంలో కార్తిక సోమవారం సందర్భంగా శివపార్వాతుల కల్యాణం నిర్వహించనున్నట్లు నాగిరెడ్డిపల్లె వ్యవసాయ సహకార పరపతి సంఘం మాజీ చైర్మన్ ముసలిరెడ్డిగారి రాజారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 9:30 గంటల నుండి శివపార్వతుల కల్యాణం, అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు

వివరాలను ఎప్పటికప్పుడు సేకరించాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

జమ్మలమడుగు : అంగన్‌వాడీల పరిధిలో గర్భిణుల, బాలింతల వివరాలను సేకరించి ఆన్‌లైన్ చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ తెలిపారు. శనివారం పట్టణంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. గర్భిణులుగా ఉన్న మహిళలకు నెల నెల తీసుకోవలసిన జాగ్రత్తలతోపాటు వైద్య పరీక్షల గురించి వివరించాలన్నారు. కడుపులో బిడ్డ ఎదుగుదలకు తినవలసిన పౌష్టికాహారం గురించి వివరించి ప్రసవం సమయంలో ఆసుపత్రిలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్యూటీ వెల్‌నెస్‌పై అవగాహన కలిగి ఉండాలి



బ్యూటీ వెల్‌నెస్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ ప్రసన్న ప్రియదర్శిని

కమలాపురం : ఆడపిల్లలు బ్యూటీ, వెల్‌నెస్ (ఆరోగ్యం, అందం)పై అవగాహన కలిగి ఉండాలని జడ్పీ గర్ల్స్ హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సరస్వతి తెలిపారు. శనివారం స్థానిక జడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో 9, 10వ తరగతి విద్యార్థినీలకు బ్యూటి అండ్ వెల్‌నెస్ ఒకేషనల్ కోర్సుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు బ్యూటీ, వెల్‌నెస్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఒకేషనల్ ట్రైనర్ ప్రసన్న ప్రియదర్శిని ఆధ్వర్యంలో స్థానిక ఫ్రెష్‌లుక్ సెలూన్ బ్యూటీ పార్లర్‌కు విద్యార్థినులను తీసుకెళ్లి నిర్వాహకురాలు సబియా బాను పర్యవేక్షణలో బ్యూటీ అండ్ వెల్‌నెస్‌లో వాడే పదార్థాలు, పరికరాలను గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



వేముల హాస్టల్‌లో మందును పిచికారీ చేయిస్తున్న సిద్ధయ్య

వేముల : స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో శనివారం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య ఆధ్వర్యంలో దోమల నివారణకు పైరిత్రం పిచికారీ చేయించారు. అనంతరం ఆయన ల్యాబొరేటరీని తనిఖీ చేసి రికార్డుల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికైనా జ్వరం వచ్చినట్లయితే వెంటనే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. మలేరియా, డెంగీ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ జబీవుల్లా, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రమేష్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతపై దృష్టి సారించాలి



విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న హెడ్మాస్టర్

పులివెందుల టౌన్ : వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించాలని పాఠశాల హెడ్మాస్టర్ శ్రీనివాసులరెడ్డి విద్యార్థులకు సూచించారు. శనివారం పట్టణంలోని స్థానిక అహోబిలాపురం ప్రభుత్వ మెయిన్ ఉన్నత పాఠశాలలో సార్డ్స్ (సోషల్ యాక్టివిటీస్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ), గ్రామాల సంయుక్త ఆధ్వర్యంలో డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా ప్రాజెక్టులో భాగంగా విద్యార్థులకు హ్యాండ్ వాష్ మీద చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం చిత్రలేఖన పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. డీబీఎస్‌వి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ విష్ణువర్ధన్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు ఎం.రాజు పాల్గొన్నారు.

అవకాశమిదే.. వినియోగించుకోండి

- 18 ఏళ్లు నిండాయా.. ఓటరుగా నమోదు చేసుకోండి
- ఓటరు లిస్టులో తప్పొప్పులను సరిచేసుకోండి
- ఈ నెల 23,24 చివరి అవకాశం
- ఆయా పోలింగ్ స్టేషన్ల వద్దే స్పెషల్ రివిజన్



ఎర్రగుంట్లలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి బీఎల్‌ఓలకు సూచనలు ఇస్తున్న తహసీల్దార్ శోభన్‌బాబు

ఎర్రగుంట్ల : సార్వత్రిక ఎన్నికలు జరిగి ఆరు మాసాలు గడవక ముందే కేంద్ర ఎన్నికల సంఘం పారదర్శక ఓటర్ల జాబితతో పాటు ఓటరు నమోదు ప్రక్రియపై మరోసారి దృష్టి సారించింది. స్పెషల్ సమ్మరీ రివిజన్–25లో భాగంగా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు అవకాశం కల్పించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే ముందుగా బీఎల్‌ఓలను ఇంటింటికీ పంపి నూతన ఓటర్ల వివరాలతో పాటు ప్రస్తుతం ఓటర్లకు సంబంధించి మార్పులు, చేర్పులుపై సర్వే చేయించింది. సర్వే అనంతరం గత నెల 29వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించింది. ముసాయిదా ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించేందుకు అక్టోబరు 29 నుంచి నవంబరు 24వ తేదీ వరకు ఎలక్షన్ కమిషన్ అవకాశం కల్పించింది. ఇందుకు అనుగుణంగా నవంబర్ 24వ తేదీ ప్రతి శని, ఆదివారాల్లో పోలింగ్ స్టేషన్ల వద్ద బీఎల్‌ఓలు అందుబాటులో ఉండి క్లెయిమ్స్‌తో పాటు అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఈ స్పెషల్ క్యాంపెయిన్‌లో వచ్చిన అభ్యంతరాలను డిసెంబర్ 24వ తేదీ లోపల పరిష్కరించి 2025 జనవరి 6వ తేదీన ఫైనల్ పబ్లికేషన్ చేయనున్నారు. నవంబర్ నెలలోని ప్రతి శని, ఆదివారాల్లో పోలింగ్ బూతలు వద్ద స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించాలని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రతి శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్యాంపు నిర్వహించాలని, ఇందులో ఫామ్ 6, 7, 8 స్వీకరించాలని మార్గదర్శకాలను సూచించింది. అయితే కొన్ని చోట్ల బీఎల్‌ఓలు తమ విధులను నామ మాత్రంగా నిర్వహించడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గ వ్యాప్తంగా ఓటర్ల జాబిత వివరాలు

మండలం	పోలింగ్‌స్టేషన్	పురుషులు	స్త్రీలు	థర్డ్‌జెండర్	ఓటర్లు
పెద్దముడియం	34	12241	12820	1	25062
మైలవరం	46	16050	16633	2	32685
జమ్మలమడుగు	74	30229	32577	7	62813
కొండాపురం	44	16847	18083	2	34932
ముద్దనూరు	38	13195	13999	1	27195
యర్రగుంట్ల	79	29134	30609	2	59745
మొత్తం	315	117696	124721	15	242432

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన తహసీల్దార్..

మండల పరిధిలోని 79 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో శనివారం ప్రత్యేక క్యాంప్ నిర్వహించారు. ఎర్రగుంట్ల పట్టణంలోని పోలింగ కేంద్రాలను తహసీల్దార్ శోభన్‌బాబు పరిశీలించారు. క్యాంప్‌లో బీఎల్‌ఓ అందుబాటులో ఉండి వస్తున్న అభ్యంతరాలను స్వీకరించాలని సూచించారు. విధులకు హాజరు కాకపోతే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోబడుతాయని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు అందుబాటులో ఉండాలి



బీఎల్‌ఓలు విధిగా శని, ఆదివారాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌ఓలకు కేటాయించి పోలింగ్ స్టేషన్‌ల వద్ద విధులు నిర్వహించాలి. ఓటరు నమోదు, సవరణలు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించాలి. విధులకు రానివారిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.
– శోభన్‌బాబు, తహసీల్దార్, ఎర్రగుంట్ల

అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు



అయ్యప్ప స్వాములకు భోజనం వడ్డిస్తున్న ఎస్‌ఐ తిరుపాల్ నాయక్

వేంపల్లె : అయ్యప్ప స్వాములకు వేంపల్లె ఎస్‌ఐ తిరుపాల్ నాయక్ శనివారం స్థానిక రంగయ్యతోటలో భిక్ష ఏర్పాటు చేశారు. అనంతరం స్వాములతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పవిత్రమైన కార్తిక మాసంలో కఠోర దీక్ష పాటిస్తూ అనునిత్యం అయ్యప్ప నామస్మరణతో, భక్తి శ్రద్ధలతో మాలాధారణ ధరించిన స్వాములకు భోజనాన్ని ఏర్పాటు చేయడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది,అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యత

పులివెందుల రూరల్ : పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం పులివెందులలోని ఎమ్మెల్సీ స్వగృహంలో నియోజవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 6 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు.

వలంటీర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

కమలాపురం : తమ ప్రభుత్వం వస్తే వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తానని ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. శనివారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసన మండలిలో మండలి సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి డోల బాలవీరాంజనేయస్వామి వలంటీర్లు లేరు అని చెప్పడం సరైంది కాదన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్లను తొలగిస్తున్నట్లు జీఓ విడుదల చేయలేదని, అలాంటప్పుడు వలంటీర్ల వ్యవస్థ లేదని మంత్రి ప్రకటించడం బాధ్యతారాహిత్యం అన్నారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే రూ.10వేలు ఇస్తానని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు సైలెంట్‌గా ఉంటే ఎలా? అని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం తిరిగి విధుల్లోకి తీసుకుంటారని వలంటీర్లు ఆశగా, ఆత్రుతగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఇటువంటి తరుణంలో మంత్రి ప్రకటన వలంటీర్లలో భయాందోళన కలిగిస్తుందన్నారు. ఎన్నికల సమయంలో కొంత మంది మాత్రమే రాజీనామాలు చేశారని, లక్షల మంది అలాగే ఉన్నారన్నారు. సీఎం చంద్రబాబు తక్షణం స్పందించి వలంటీర్లను విధుల్లోకి తీసుకుని ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. లేని పక్షంలో వలంటీర్లతో కలసి పోరాటానికి సిద్ధం అవుతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో డీవైఎఫ్‌ఐ నాయకులు సూరి, ఇసాక్ పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



ధర్నా కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ, భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు

వేంపల్లె : కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 26న దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలు చేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా కడపలో కళాక్షేత్రంనుంచి ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన ధర్నాకు రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం వేంపల్లెలోని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో కరపత్రాలను ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి బాదుల్లా, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి.రామాంజనేయులు, ఏఐటీయూసి జిల్లా నాయకులు పి సుబ్బరాయుడు విడుదల చేశారు. పెద్దసంఖ్యలో నిరుద్యోగులు, కార్మికులు, రైతులు, కౌలు రైతులు, ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

జీవనోపాధి మెరుగు పరచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం గంగాధర్

కమలాపురం : స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రతి ఒక్కరూ తమ జీవనోపాధిని మెరుగు పరచుకోవాలని డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్ తెలిపారు. శనివారం స్థానిక మండల సమాఖ్య సమావేశ మందిరంలో ఓబీలు, ఈసీ మెంబర్స్, గ్రామ సమాఖ్య సహాయ సేవకురాళ్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా మార్ట్ ఏర్పాటు, సభ్యుల ఆర్థిక ఆదాయ జీవనోపాధి ప్రణాళిక సర్వే, ఓపెన్ నెట్‌వర్క్, డిజటల్ కామర్స్ వివిధ విభాగాల నుంచి తీసుకున్న రుణాలు, వాటి వినియోగం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల సమాఖ్యలోని వీఏఓలు, సభ్యులు తీసుకున్న రుణాలను సక్రమంగా వినియోగించుకుని వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తూ తమ జీవనోపాధి ప్రమాణాలు పెంచుకోవాలన్నారు. రుణాల కంతులు సక్రమంగా చెల్లించి తిరిగి అధిక రుణాలు పొందాలన్నారు. దీని వలన బ్యాంకులతో మంచి సంబంధాలు నెరపడమే కాక మన జీవన ప్రమాణాలు పెరుగుతాయన్నారు. 25వ తేదీన జెండర్ ర్యాలీ నిర్వహించాలన్నారు. కలెక్టర్ పల్లెనిద్ర చేయనున్నారని, ఈ కార్యక్రమంలో తమ శాఖ తరఫున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, సీసీలు, వీఏఓలు, ఓబీలు పాల్గొన్నారు.

కిశోరి వికాసం కార్యక్రమాలపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ మోహన్‌రావు

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో నవంబర్ 26న ఉదయం10.30 గంటలకు కిశోరి వికాసం కార్యక్రమాలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కుల్లాయిబాబు శనివారం ప్రకటనలో తెలిపారు. శిక్షణ కార్యక్రమం మండల పరిధిలోని మహిళా పోలీసులు, సోషల్ వెల్ఫేర్ సహాయకులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు వారి పరిధిలోని పై వారు హాజరయ్యే విధంగా చేయాలన్నారు. అలాగే మండల పరిధిలోని పాపాసాహెబ్‌పేట గ్రామపంచాయతీ సచివాలయాన్ని ఎంపీడీవో శనివారం సందర్శించారు. సచివాలయ సిబ్బందితో హౌస్ హోల్డ్ మ్యాపింగ్ సర్వే, ఎన్పీసీఐ సర్వేలను క్లస్టర్ల వారీగా పర్యవేక్షించి, పంచాయతీ పరిధిలోని సిమెంటు రోడ్ల నిర్మాణాన్ని తనిఖీ చేశారు.

చెన్నూరులో..

వల్లూరు (చెన్నూరు) : ఈనెల 26న జరగబోయే కిషోరి వికాసం సమావేశంపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మోహన్‌రావు అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 11 నుంచి 19 సంవత్సరాలలోపు బాల బాలికల సంరక్షణపై ఈనెల 26న అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఫోక్సో చట్టం, ఆరోగ్యం, యోగా, బాల్యవివాహాల నివారణ, హ్యూమన్ ట్రాకింగ్, ఆత్మరక్షణ, పరిసరాలు పరిశుభ్రత, అక్ర మ రవాణా, పౌష్టికాహారం, జీవనోపాధి తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందు కు సంబంధిత అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. శిక్షణ పొందిన అధికారులు ఆయా పాఠశాలలో విద్యార్థులకు పైన తెలిపిన అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఆయా శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలన్నారు. ఎంపీపీ సురేష్‌యాదవ్, ఎంఈఓ గంగిరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి, ఏపీఎం వెంకటేష్, ఐసీడీఎస్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

పరామర్శ



అమర్‌నాథ్‌రెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ జెసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డిని శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. అమర్‌నాథ్‌రెడ్డి ఇటీవల గుండెకు స్టంట్ వేయించుకుని ఇంటి వద్ద విశాంత్రి పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అతనిని పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని అకాంక్షించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె : మండలంలోని గంగిరెడ్డిపల్లె వైఎస్సార్ కాంగ్రెస్ నాయకుడు పాల నారాయణరెడ్డి కుమారుడు నవీన్‌రెడ్డి గురువారం జరిగిన ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి శనివారం పరామర్శించారు. మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఆయన వెంట ఉన్నారు.

సంక్షేమ పథకాలే విజయానికి కారణం

వేంపల్లె : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో ఎన్డీఏ కూటమి విజయం సాధించడంపట్ల వేంపల్లిలోని బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కూటమి విజయంపై వేంపల్లెలోని నాలుగు రోడ్ల కూడలిలో పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరి ప్రసాద్ మాట్లాడుతూ నరేంద్రమోదీ వికసిత భారత్ లక్ష్యంగా పనిచేస్తుండటంతో అతిపెద్ద రాష్ట్రమైన మహారాష్ట్రలో ప్రజలు ఎన్డీఏ కూటమికి 217 సీట్లతో పట్టం కట్టడం హర్షణీయమన్నారు. భారతదేశాన్ని విశ్వ గురువుగా మోదీ చేస్తున్న కృషి అనితరమైందని, దేశ వ్యాప్తంగా చేస్తున్న సంక్షేమ పథకాలే విజయానికి కారణమన్నారు. మహారాష్ట్ర ప్రజలు ఐకమత్యంతో ఉండి కూటమికి విజయాన్ని ఇచ్చారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మ, బీజేపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతు సుమన్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అఖండ మెజార్టీతో విజయం సాధించడంపట్ల బీజేపీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రమైన సింహాద్రిపురం బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మెడికల్ క్యాప్‌ను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారిని మనోరమ

పెండ్లిమర్రి : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారిని మనోరమ తెలిపారు. శనివారం చౌటపల్లెలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాప్‌ను ఆమె పరిశీలించి మాట్లాడారు. జ్వరాలు రాకుండా ఉండాలంటే పరిసరాలను పరిశ్రుభంగా ఉంచుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. జ్వరాలు వచ్చిన ప్రతి ఒక్క రు రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. గ్రామంలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ వినయ్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ముజీబ్, సబ్ యూనిట్ ఆఫీసర్ మురళి, ఎంపీహెచ్‌ఈఓ రామప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

సుభద్రమ్మపై చర్యలు తీసుకోవాలి

కమలాపురం : స్థానిక బాలయోగి గురుకుల పాఠశాలలో గ్రూపు రాజకీయాలకు పాల్పడుతూ ఉపాధ్యాయునీల మధ్య చిచ్చు పెడుతున్న ఫిజిక్స్ టీచర్ సుభద్రమ్మపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకుల పాఠశాలలో జరుగుతున్న ఘటనలకు కారకులైన సుభద్రమ్మను వదిలేసి పార్ట్‌టైం, కాంటాక్ట్ బేసిక్‌పై పనిచేస్తున్న పీఈటీలకు మెమోలు ఇవ్వడం కంటితుడుపు చర్యేనని ఆయన అన్నారు. ఎవరు వచ్చి అడిగినా ప్రిన్సిపాల్‌కు వ్యతిరేకంగా చెప్పాలని మూడు రోజులుగా విద్యార్థినులను బెదిరిస్తున్న సుభద్రమ్మపై డీసీఓ చర్యలు తీసుకోక పోతే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. డీసీఓ తనకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, ఇది సరికాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలలో జరుగుతున్న ఘటలను విచారించి బాధ్యులపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

కడప ఎడ్యుకేషన్ : సమగ్ర యాజమాన్య పద్ధతులతో విశిష్ట(టీసీజీఎస్–1694) రకం విత్తనంతో వేరుశనగలో అధిక దిగుబడులు సాధించవచ్చని ఊటుకూరు కృషి విజ్ఞానకేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. శనివారం కేవీకేలో బయోటెక్ కిసాన్ హబ్ పథకంలో భాగంగా సికెదిన్నె మండలం ఇప్పపెంట, వేంపల్లి మండలం గిడ్డంగివారిపల్లె, సిద్దవటం మండలం గుండమల గ్రామ రైతులకు సామూహిక ప్రథమశ్రేణి క్షేత్ర ప్రదర్శన కింద రబీ కాలానికి విత్తనం ఇవ్వడం జరిగింది. అనంతరం వేరుశనగలో అధిక ఉత్పాదకతను పెంచడంపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

కమలాపురం : రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా జాతీయ ఐక్యత కోసం డిసెంబర్ 15న జమియత్-ఒలమా-ఏ-హింద్ ఆధ్వర్యంలో జరిగే చలో కడప భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లా నాయకుడు హామీద్ హుసేన్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మదీన మస్జిద్‌లో నిర్వహించిన ముస్లిం సహోదరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా జాతీయ ఐక్యత కోసం దేశ ప్రజల సమానత్వం కోసం, దేశ సమగ్రత కోసం డిసెంబర్ 15న కడప నగరంలో నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభకు దేశ నాయకుడు మౌలానా అర్షద్ మదని సాహద్ హాజరు కానున్నారని ఆయన తెలిపారు. ఈ సభకు మన జిల్లా, రాష్ట్రం నలు మూలల నుంచి ముస్లిం సోదరులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పాలస్తీనల్లపై జరుగుతున్న దాడులు, యూనిఫాం సివిల్ కోడ్ తదితర పరిణామాలు జరుగుతున్న నేపథ్యంలో ముస్లిం మత పెద్దలు దేశంలో మూడు భారీ బహిరంగ సభలను నిర్వహించాలని నిర్ణయించారన్నారు. ఇందులో ఇప్పటికే ఢిల్లీలో ఈనెల 3వ తేదీన నిర్వహించారని, దాదాపు 5లక్షల మంది ముస్లింలు హాజరయ్యారని గుర్తు చేశారు. 24న బీహార్‌లో మరో సమావేశం నిర్వహించ నున్నారన్నారు. మూడవ సమావేశం డిసెంబర్ 15న కడప నగరంలో నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని మస్జిద్‌లో ఇమాంలు, మత పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీసత్యసాయిబాబా జన్మదినోత్సవం



నిరుపేదలకు సరుకులను అందిస్తున్న సమితి సభ్యులు

పులివెందుల టౌన్ : భగవాన్ శ్రీసత్యసాయి బాబా 99వ జయంతి సందర్భంగా పట్టణంలోని శ్రీసత్య సాయిబాబా ఆలయంలో శనివారం స్నేహిత అమృత హస్తం సేవాదళ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయిబాబా సేవాసమితి బృందం, స్నేహిత అమృత హస్తం సేవాసమితి బృందం పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : భగవాన్ శ్రీసత్యసాయిబాబా జన్మదినం పురస్కరించుకుని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీషిర్డీసాయి ఆలయంలో ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. మండల వ్యాప్తంగా పలు పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఉత్సాహం చూపారు. అనంతరం పేదలకు దుస్తులను పంపిణీ చేశామని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కె.సాయినాథ్ తెలిపారు.

గుంతలను పూడ్చండి సారూ..

- ఆర్టీసీ బస్టాండు వద్ద ఛిద్రమైన రహదారి
- మరమ్మతులు చేయాలని ప్రజల విన్నపాలు



కల్వర్ట్‌పై ప్రయాణికులకు ప్రమాదకరంగా మారిన గుంత



ఎంపీపీ స్కూల్ పక్కనే ఉన్న డ్రైనేజ్ కాలువ నుంచి బయటకు వచ్చిన మురికి నీరు

కమలాపురం : స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని కోగటం రోడ్డు గుంతలమయమై ఛిద్రంగా మారింది. బస్టాండు పక్కనే ఉన్న ఎంపీపీ స్కూల్‌కు ఆనుకుని ఉన్న డ్రైనేజ్ కాలువ నుంచి నిత్యం మురికి నీరు వచ్చి గుంతల్లో నిలుస్తోంది. కోగటం రోడ్డులోనే మూడు హైస్కూల్స్, ఒక ప్రైమరీ పాఠశాల ఉంది. పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, కోగటం మీదుగా ప్రొద్దుటూరుకు వెళ్లే ప్రయాణీకులతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఇటు వంటి రహదారి గుంతలమయం కావడంతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే వీధుల్లో ఉన్న డ్రైనేజ్ నుంచి మురికి నీరు వచ్చే కల్వర్ట్ మధ్యలో గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. రాత్రిళ్లు ఈ దారిలో వెళ్లాలన్నా ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేపట్టాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేదని స్థానికులు వాపోతున్నారు. రెండు సార్లు జరిగిన మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే చైతన్యరెడ్డి స్వయంగా ఈ గుంతలు పూడ్చాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అయినా స్పందన లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణం గుంతలను పూడ్చడంతో పాటు డ్రైనేజ్ కాలువల్లో పూడిక తీసి మురికినీరు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు నూర్‌బాషా, మహమ్మద్, రాజా, గోపాల్, సునీల్, రమేష్ తదితరులు కోరుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్‌ను వివరణ కోరగా రెండు రోజుల్లో గుంతలు పూడ్చి ప్రయాణీకుల ఇబ్బందులు నివారిస్తామని తెలిపారు.



గుంతలమయంగా మారిన కోగటం రోడ్డు